ప్రమాదాలకు హైవే

సంతోషంగా గమ్యస్థానాలకు చేరాల్సిన ఎంతో మంది జీవితాలు మార్గమధ్యంలోనే ముగిసిపోతున్నాయి. అతివేగంతో పాటు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఎక్కువ మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు
- అకాల మరణాలలో తల్లడిల్లుతున్న బాధిత కుటుంబాలు
- జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనేనంటున్న అధికారులు


పెనుకొండ వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్)


సోమందేపల్లి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన దృశ్యం (ఫైల్)

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. అతి వేగం ప్రమాదాలకు ముఖ్యకారణమైతే మద్యం సేవించి వాహనాలు నడుపుతుండటంతో ఈ సంఖ్య పెరుగుతోంది. ఆర్టీఓ సిబ్బందితో పాటు పోలీసులు కూడా నిత్యం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వాహనదారులు జాగ్రత్తలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు అదుపులోకి రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

జరిగిన ప్రమాదాలు ఇలా....

పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కియాస్టేషన్ పరిధిలో ఏడాది కాలంలో 28 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వివిధ ఘటనల్లో 16 మంది చనిపోయారు. పెనుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 23 కేసులు నమోదు కాగా 13 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సోమందేపల్లి మండలంలో 17 ప్రమాదాలు చోటు చేసుకోగా 11 మంది మృతి చెందినట్లు రికార్డుల్లో నమోదు అయ్యాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రయాణం చేసేటప్పుడు ప్రతి 2 గంటలకు ఓసారి వాహనాన్ని ఆపి కొంత సమయం నడవడం, టీ, కాఫీ లాంటివి తాగడం మంచిది.
- డ్రైవర్ తనకు తాను అసౌకర్యాన్ని కలిగించుకోవాలి. ఏసీ ఆఫ్ చేయడం, అద్దాల నుంచి కింద దించడం లాంటివి చేస్తే చికాకు కలిగి అప్రమత్తంగా ఉంటారు.
- పదే పదే సైడ్ మిర్రర్ , రియల్ మిర్రర్‌లను చూడాలి. దీంతో మెదడు బాగా పనిచేస్తుంది.
- ఎక్కువ సేపు డ్రైవింగ్ చేసే ముందు రోజు రాత్రి మంచినిద్రగా నిద్రపోవాలి. అర్ధరాత్రి, వేకువ జామున డ్రైవింగ్‌లను నివారించాలి.

గుబులు రేపుతున్న హిప్నోసిస్

నాలుగు వరుసల రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు మధ్యలో డివైడర్లు ఉండటంతో ముందు నుంచి వాహనాలు వచ్చే అవకాశమే ఉండదు. మలుపులు కూడా ఎక్కడోగాని రావు. మరోవైపు ఆధునిక ఫీచర్లతో కార్లు, ఏసీతో చుట్టూ చల్లదనం. ఆడియో సిస్టం నుంచి మధురమైన సంగీతం వస్తుంటే చాలా మంది రయ్ మంటూ దూసుకెళ్తుంటారు. పెద్దగా శ్రమ లేకుండానే గమ్యస్థానాన్ని చేరుకుంటామని అంతా భావిస్తుంటారు. కానీ అత్యంత సౌకర్యవంతమైన డ్రైవింగ్ వెనుక ఓ పెనుముప్పు పొంచి ఉంది. అదే హైవే హిప్నోసిస్ స్థితి.

ఎందుకిలా?

సాధారణంగా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కనురెప్పలు మూతపడి ప్రమాదాలు జరుగుతుంటాయి. దీనికి హైవే హిప్నోసిస్ కాస్త భిన్నమైంది. హైవేలపై ఇప్పుడు ప్రయాణం సుఖవంతంగా మారింది. ఎదురుగా వాహనాలు రాకపోవడంతో గేర్లు మార్చాల్సిన అవసరం కూడా ఉండదు. దీంతో వాహనం నడిపే వ్యక్తి మెదడుకు విశ్రాంతి లభిస్తుంది. ఈ స్థితిలో డ్రైవర్ నిద్రపోరు. కానీ డ్రైవర్ మెదడు మాత్రం నెమ్మదిగా విశ్రాంతిలోకి వెళ్తుంది. ఈ స్థితినే హిప్నోసిస్ అంటారు. 2 నుంచి 3 గంటల నిరంతరాయంగా డ్రైవింగ్ చేసిన తర్వాత 5 నుంచి 15 నిముషాల పాటు ఈ స్థితి ఉంటుంది. ఆ సమయంలో డ్రైవర్‌కు నియంత్రణ ఉండదు. ఎదురుగా ఏదైనా వాహనం ఆపి ఉంచినా చివరి నిముషం వరకు గుర్తించలేక దాన్ని ఢీకొట్టేస్తారు. మలుపులను గుర్తించలేరు. బ్రిడ్జి, ఫ్లైవర్లు వచ్చినా రెయిలింగ్‌ను ఢీ కొట్టే అవకాశాలు ఉంటాయి. హైవేపై ఏదైనా కూడలి వచ్చినా గమనించరు. హిప్నోసిస్ ప్రభావం రాత్రి సమయాల్లో ఎక్కువ ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. హిప్నోసిస్ వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.


పెనుకొండ జాతీయ రహదారిపై పుట్టపర్తి మలుపు దగ్గర లారీని ఢీకొట్టిన కారు (ఫైల్)

హిప్నోసిస్ వల్లే ఎక్కువ ప్రమాదాలు



జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు ఎక్కువ భాగం హిప్నోసిస్ స్థితి వల్లనే జరుగుతున్నాయి. ప్రయాణం చేసేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో ఉండాలి. సుదూర ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు ప్రతి రెండు గంటలకు ఒకసారి కచ్చితంగా విరామం తీసుకోవాలి.

– నాగరాజునాయక్, వైద్యుడు, గుట్టూరు

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అక్కడ డ్రైవర్లు అప్రమత్తమయ్యేలా చర్యలు చేపట్టాం. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో రహదారి వెంబడి స్టిక్కరింగ్, సర్వేలెన్స్ కెమెరాలు , సోలార్ బల్బులును ఏర్పాటు చేయిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కూడా కల్పిస్తున్నాం.

– కరుణాకర్, సీఐ, పెనుకొండ

ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)
హిందూపురం : 23.0
పెనుకొండ : 24.0
మడకశిర : 23.0

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: మండలంలోని సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకూ https:// apms. ap. gov. in/ apms అన్న వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 చెల్లించాలన్నారు. పాఠశాలలో జూన్ 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9949909915కు లేదా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా భూతప్ప ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి పంచాయతీలోని గ్రామాల ప్రజలు ఆదివారం తెల్లవార జామున భూతప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లో విందు భోజనాన్ని స్వీకరించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆకాంక్షించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు, నాగన్న, జెడ్పీటీసీ భూతరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి తొట్టెల పంపిణీ


నీటి తొట్టెలను వితరణ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

లేపాక్షి: గణపతి సచ్చిదానంద జ్ఞాన బోధ సభ అనఘాదత్త ట్రస్ట్ హిందూపురం వారి ఆధ్వర్యంలో సేవా న్యాచురల్ వలంటీర్ ఏపీ వార భరత్ (యూఎస్ఏ) దాతృత్వంతో ఆదివారం ఉదయం ప్రకృతి, జంతు ప్రేమికులకు 45 సిమెంట్ నీటి తొట్టెలను వితరణ చేశారు. పశుపక్షాదుల దాహం తీర్చేందుకు తొట్టెలను పంపిణీ చేసినట్లు మండలంలోని తిలక్‌నగర్ ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరయ్య పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. రెగ్యులర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హసీనా సుల్తానా సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న భాగ్యలక్ష్మికి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ఏమైనా భూ సమస్యలు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో రేణుక యల్లమ్మదేవి

రొద్దం: మండల కేంద్రంలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదారి పక్కన, మారెమ్మ దేవాలయం వద్ద వెలసిన రేణుక యల్లమ్మదేవి 5వ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రాణప్రతిష్ఠ, ధ్వజారోహణ, పూర్ణాహుతి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రంగేపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. పట్టుబడ్డ వారి నుంచి రూ.5,850 నగదు స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరు పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ఆదినారాయణ, నగేష్, దస్తగిరి, బాబ్ జాన్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. మిట్టాంజనేయ స్వామి డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, రవూఫ్, బాబిరెడ్డి, వెంకటరత్నం, తదితరులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం కోసం బ్రిటీష్ వారితో ఎదురొడ్డి పోరాడిన విప్లవనేత అని కొనియాడారు. దేశ ప్రజల గుండెల్లో ఎన్నటికీ అల్లూరి సీతారామరాజు పేరు చెరిగిపోదని వారు పేర్కొన్నారు.

తిమ్మరాయప్పను గెలిపించండి


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న నాగరత్నమ్మ

పావగడ: జేడీఎస్ అభ్యర్థి, తన భర్త అయిన కేఎం తిమ్మరాయప్పను అధిక మెజారిటీతో గెలిపించాలని స్థానిక విధాన సభ క్షేత్రం జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప సతీమణి నాగరత్నమ్మ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని ఆదర్శనగర్ ఎస్సీ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. అదే విధంగా కోడిహళ్లి మఠాధిపతి షడక్షర స్వామిజీ మాట్లాడుతూ ఈ నెల 10 న జరిగే విధానసభ ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పను గెలిపించాలని కోరారు. తాలూకాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మాదిగలు తమ సముదాయానికి ప్రతినిధిగా నిలిచిన తిమ్మరాయప్పను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వన్నూరువలీ


రవికుమార్

పెనుకొండ రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో ఢీ కొనడంతో గాయపడిన సంఘటన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుకొండ పట్టణ పరిధిలోని తిమ్మాపురం దాల్ మిల్ వద్ద ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు... తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన శ్రీరాములు తన ద్విచక్ర వాహనంలో పెనుకొండ నుంచి తిమ్మాపురం వెళ్తున్నారు. అలాగే గుట్టూరు వైపు నుంచి పెనుకొండ వైపు ద్విచక్ర వాహనంలో వన్నూరు వలీ, అయేషా వెళ్తున్నారు. అయితే తిమ్మాపురం దాల్ మిల్ వద్ద రెండు వాహనాలు పరస్పరం ఢీ కొన్నాయి. ఉన్నట్టుండి ఈ ఘటన చోటు చేసుకోవడంతో పెనుకొండ వైపు నుంచి ఐదుగురితో వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సుయ్యిలో పడటంతో డ్రైవర్ రవికుమార్ గాయపడ్డారు. మిగతా వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులు రవికుమార్, శ్రీరాములు, అయేషా, వన్నూరువలిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు రవికుమార్, వన్నూర్‌వలిని అనంతపురం తీసుకెళ్లారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి


బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెనుకొండ: పట్టణంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ పెద్దలు యాడికి నాగరాజు, ప్రగతి శ్రీనివాసులు, పూర్ణచంద్ర, నాగరాజు కోరారు. ఆలయ కమిటీ నేతృత్వంలో వేంకటేశ్వస్వామి ఆలయ ఆవరణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 14 వరకు ఆరు రోజుల పాటు నిరవధికంగా పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 9న పంచామృతాభిషేకంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 14న విశ్వరూప దర్శనంతో ముగింపు ఉంటుందన్నారు. పెనుకొండతో ఇతర ప్రాంతాల వారు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఎరుకల ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న శంకరయ్య

లేపాక్షి: ఆంధ్రప్రదేశ్ ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు శంకరయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రమైన లేపాక్షిలో ఆదివారం ఉదయం ఎరుకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో మనం ఉన్నత స్థాయికి ఎదగాలంటే కచ్చితంగా ఐకమత్యంగా ఉండాలన్నారు. చదువును కులవృత్తిలాగా భావించి పిల్లలను బాగా చదివించాలన్నారు. చదువు మన పిల్లల అభివృద్ధికి, కుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు శంకర్, మధు, తిరుపతయ్య, కల్యాణ్, గంగాధర్, గంగప్ప, అలివేలమ్మ, నాగమణి, చౌడమ్మ, సుశీలమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ: పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో 2012–14 సంవత్సరానికి సంబంధించి డీఎడ్ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆ కళాశాలలోనే జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధ్యాపకులు తమ ఉన్నతికి అందించిన సహకారాన్ని కొనియాడారు. ఏఓ కేశవయ్య, అధ్యాపకులు ప్రతాప్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


ఉగ్గిరెడ్డిపల్లిలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఓడీ చెరువు: మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలంకరణ మధ్య సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. పుష్పమాల ధారణతో శాస్త్రోక్తంగా కన్యాదానం, కంకణాలు, మంగళసూత్రాలు, సమర్పించి కల్యాణం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన


పూలరథంపై దర్శనమిస్తున్న రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరిప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంపై కొలువుదీర్చి పూజలు చేసి భక్తుల గోవిందా నామ స్మరణ మధ్య గిరి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మంగళహారతులిచ్చి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు నరసింహులు భక్తులు పాల్గొన్నారు.

పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం


ప్రేమ వివాహం జరిపించిన దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం జరిపించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముఖేష్‌కుమార్, బీహార్‌కు చెందిన ఆకాంక్ష మిశ్రాలు వృత్తిరీత్యా పట్టణంలో ఉంటున్నారు. గత కొన్నేళ్లుగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. అయితే వీరి పెళ్లికి వారి కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో ప్రేమికులు ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ సభ్యులను ఆశ్రయించారు. దీంతో వారు ప్రేమికుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని ఒప్పించి స్థానిక మేళాపురంలోని బైలాంజనేయస్వామి ఆలయంలో ఇరువురికి వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు చలపతి, ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, కౌన్సిలర్ శివ, రామాంజినేయులు, నాగరాజు, వెంకటేష్, రమణ, వెంకటస్వామి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేష్ సతీమణి శశికళ

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆదివారం ముగిసింది. ఈ నెల 10 న జరిగే ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు సుమారు నెల రోజుల పాటు నిర్విరామంగా ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించాయి. ఆదివారం చివరి రోజు అన్ని పార్టీల నాయకులు హోరాహోరీగా ప్రచారం చేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేష్, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప, బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్, కేఆర్పీపీ అభ్యర్థి నాగేంద్ర, ఆప్ అభ్యర్థి రామాంజినప్ప, బీఎస్పీ అభ్యర్థి హనుమంతరాయ తదితర స్వతంత్ర అభ్యర్థులు జోరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ తరపున అభ్యర్థి వెంకటేష్ సతీమణి శశి కళ , కుటుంబ సభ్యులు వైఎన్ హొసకోటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన భర్త వెంకటేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అదే విధం గా జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప దొమ్మతమరి, విరుపసముద్రం, గుమ్మఘట్ట, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక ఎస్ఎస్‌కే పాత ఛత్రంలో సాయంత్రం నిర్వహించిన ఆర్యవైశ్య సముదాయ సమావేశంలో మాజీ ప్రధాని దేవేగౌడకు అత్యంత సన్నిహితుడైన జేడీఎస్ ఎమ్మెల్సీ శరవణ పాల్గొని స్థానిక ఆర్యవైశ్యులు జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

నల్లమాడ: ఇంటర్‌లో ప్రవేశాలకు ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్డీటీ సెట్‌కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ సుదర్శన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్‌కు 500 మార్కులపైనా, సీబీఎస్ఈకి 420 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్డీటీ స్పాన్సర్‌షిప్ కలిగిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదివినా కూడా అర్హులేనని వెల్లడించారు. ఈనెల 9వ తేదీ నుంచి స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

రొద్దం: మండల పరిధిలోని పెద్దిపల్లి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చిట్టెమ్మ అనే మహిళను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఆమె వద్ద నుంచి 35 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

హిందూపురం: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ 68వ జన్మదినాన్ని పురస్కరించుకుని హిందూపురంలో యోగా, ధాన్యం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గురూజీ శిష్యబృంద సభ్యులు తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు, అలాగే సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. తరగతులకు హాజరయ్యేవారు 8న సాయంత్రం 6 గంటలకు పరిచయ కార్యక్రమంలో పాల్గొని పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. శిక్షణ తరగతుల్లో ముఖ్యంగా సుదర్శనక్రియ, యోగ, ప్రాణాయామం, ధాన్యం తదితర వాటిని నేర్పుతామన్నారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

రొద్దం: మండల కేంద్రంలోని మదర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉచితంగా శిక్షణతో పాటు ఉచిత వసతి కల్పిస్తామని పాఠశాల చైర్మన్ నగరూరు ధనుంజయరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి వచ్చే నెల 10 వరకూ శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదిలో తప్పిన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ, వసతి తమ పాఠశాల వద్దే ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.